క్లుప్తంగా

చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన



లక్ష్మీపురం: చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన అవసరమని సీనియర్ పల్మనాల జిస్ట్ సర్జన్ వి.వి.కె.సందీప్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పెద్దలలో ముక్కు దూలం వంకరగా ఉండటం, సైనసైటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయని, ముక్కు దూలం వంకరగా ఉంటే శ్వాస సరిగా వెళ్లక ఇబ్బందికి గురి అవుతారని దీనికి మంచి శస్త్ర చికిత్స అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం డాక్టర్ సందీప్‌ను అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వేమన ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కళ్యాణం చంద్రశేఖర రావు పాల్గొని ప్రసంగించారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గుంటూరు మెడికల్: వైద్య విద్యార్థులు తాము ఉంటున్న హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని గుంటూరు మెడికల్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను ప్రిన్సిపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి గదికి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' లక్ష్యంతో డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ వైద్య విద్యార్థులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకుని తగిన చర్యలు త్వరలో తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాలను అందరూ కలసి శాంతియుతంగా జరుపుకోవాలని, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ నిరుపేదలకు తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వర్తించాలని వాసవిక్లబ్ గుంటూరు అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు మహిళా, గుంటూరు, యువ గుంటూరు సంయుక్తంగా ఆర్.అగ్రహారం శ్రీగీతా మందిరంలో ఆదివారం 108 మందికి వృద్ధులకు ఉచితంగా బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఉచితంగా బియ్యం, పింఛన్లు పంపిణీ చేయడం వలన నిరుపేదలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సభ్యులు ఎస్‌వీ రమణరవి బాబు, జుజ్జూరు శ్రీనివాసరావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, వాసవి యువ క్లబ్ అధ్యక్షులు డి.అఖిల్, టీఎల్వీ వీరాంజనేయులు, లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కొల్లిపర దుర్గానాగమణి, పారేపల్లి బాబ్జి, కేఎస్‌వీ.నారాయణ, అడ్డగాళ్ల రామారావు, పబ్బిశెట్టి చిరంజీవి పాల్గొన్నారు.

కంకరగుంట ఆర్‌యూబీ వద్ద మరమ్మతులు చేపట్టాలి



నెహ్రూనగర్: కంకర గుంట ఆర్‌యూబీ కల్వర్ట్ ఇనుప జాలీ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కంకర గుంట దగ్గర వాహనాల రాక పోకలను పరిశీలించారు. ఇనుప జాలీ పక్కకి జరిగి ఉండడం గమనించారు. అదే విధంగా లైటింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

గతుకుల రోడ్లతో నరకయాతన



అన్నదానసత్రం పక్క రోడ్డులో ఏర్పడిన గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- అధ్వానంగా మారిన అన్నదాన సత్రం రోడ్డు
- ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- రహదారి మరమ్మతులు పట్టించుకోని నగరపాలకసంస్థ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులో అన్నదాన సత్రం పక్కరోడ్డు మీదుగా కొరిటెపాడు సెంటర్‌కు వెళ్లేందుకు కీలకంగా ఉన్న ప్రధాన రహదారి పొడవునా గోతులు, గుంతలతో నిండి, వాహనాల రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేదు. అమరావతి రోడ్డు- కొరిటెపాడుకు అనుసంధానంగా ఉన్న కీలకమైన రహదారి కావడంతో నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులతో కూడిన వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం ఈ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులను నిర్మిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు అమరావతి రోడ్డు, కొరిటెపాడును కలుపుతూ సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరుగుతున్న వాహనాల రాకపోకలకు అనువుగా ఈ రోడ్డును విస్తరించాల్సి ఉంది. అడుగడుగునా గుంతలతో నిండిన ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో ప్రయాణం సాగించాలనే నడుములు విరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరొక విషయం ఏమిటంటే గుంతలతో నిండి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న ఇదే రోడ్డులో సాయిబాబా గుడి, రామాలయం గుడి సమీపంలో స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది.

ఆకట్టుకున్న స్పేస్ సైన్స్ ఎగ్జిబిషన్



చంద్రయాన్-3 నమూనా ప్రాజెక్టుతో పాఠశాల డైరెక్టర్ నక్కా జార్జిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూనగర్‌లోని ఒలీవ స్కూల్లో ఆదివారం ఇన్‌స్పైర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ నక్కా జార్జిబాబు మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్తల ప్రతిభను, ఘనతను చాటుతూ చంద్రయాన్-3 మోడల్‌తో ఏర్పాటు చేసిన ప్రదర్శన ద్వారా విద్యార్థులకు చదువుపై శ్రద్ధతో పాటు సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భావి శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుని, దేశానికి గర్వకారణంగా ఉండాలనే భావన విద్యార్థుల్లో రేకెత్తించేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ఆదర్శప్రాయం

లక్ష్మీపురం: జీవితంలోను ఉద్యమ ప్రస్థానంలోనూ ఎన్నో ఒడి దుడుకులనూ, జయాపజయాలను ఎదుర్కొంటూనే తాను నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం అంకితమై పురోగమించిన సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం వ్యక్తిత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కమ్యూనిస్ట్ సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డికి సంస్థ సభ్యులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిజమే నిజమని చెదరని విశ్వాసంగా జీవితాంతం అరుణ పతాకం నీడ క్రింద జీవితాన్ని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్న ఆదర్శ కమ్యూనిస్టు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, పార్లమెంట్‌లో పీడిత ప్రజల పక్షాళ, శ్రామిక జనం, రైతాంగం మహిళల సమస్యలపై బలమైన గళ గర్జనలు వినిపించిన సుధాకర్‌రెడ్డి మరణం తీరని లోటని అన్నారు. ఆయన ప్రజలకు న్యాయమైన హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

నేత్ర సంరక్షణ కీలకం



నేత్ర వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న గ్రామస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: నేత్ర సంరక్షణ ఎంతో కీలకమైనదని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఆదివారం శంకర నేత్రాలయ, టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ సంయుక్తంగా గుంటూరు రూరల్ చల్లావారి పాలెంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామంలోని ప్రజలందరికీ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ సర్వేంద్రియానా నయనం ప్రధానమని, నేత్రాలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచి ఆరుదల సాంబశివరావు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. శంకర నేత్రాలయ వైద్య నిపుణురాలు ఏవీ ప్రియాంక మాట్లాడుతూ నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డు ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి ఏఎస్వీ సత్యానంద్, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

మొబైల్‌షాప్ ఓనర్స్/ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా సెల్‌బాబు

నగరంపాలెం: గుంటూరు అర్బన్ మొబైల్‌షాప్ ఓనర్స్/ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ బాబు(సెల్ బాబు) ఎన్నికయ్యారు. అరండల్‌పేట 2/4వ అడ్డరోడ్డు వైన్ డీలర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం మొబైల్‌షాప్ ఓనర్స్/ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు అధ్యక్ష పదవికి మొహమ్మద్ మోబీన్‌బాషా, షేక్ బాబు(సెల్‌బాబు), కార్యదర్శి పదవికి పఠాన్ జుబేర్ ఖాన్, తియ్యా వేణుగోపాల్ పోటీపడ్డారు. సెల్‌బాబుకి 185 ఓట్లు, మోబీన్‌బాషాకు 165 ఓట్లు, కార్యదర్శులైన జుబేర్‌ఖాన్‌కు 199 ఓట్లు, వేణుకి 150 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా సెల్‌బాబు, కార్యదర్శిగా జుబేర్‌ఖాన్ గెలుపొందినట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగనుంది.

వెస్ట్ డివిజన్‌లో ముగ్గురిపై పీడీ యాక్టు

వెస్ట్ డీఎస్పీ అరవింద్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైన గంజాయి క్రయ, విక్రయాలు జరిగినట్లు తెలిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం, పట్టాభిపురం, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో పాత గంజాయి కేసులు ఉన్న 51 మందిని ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఎక్కడైన గంజాయి అక్రమంగా తరలించడం కాని విక్రయించిన కేసుల్లో పాత గంజాయి కేసులు ఉన్నవారు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడున్న వారిని సహించేది లేదని, ఇప్పటికైన మంచి ప్రవర్తనతో నడుచుకోవాల్సిందిగా హెచ్చరించారు. ఎవరు కూడా గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాలు రోడ్డు పాలు చేసుకోవద్దని తెలిపారు. ఈగల్ బృందం కళాశాలలు, పాఠశాలలో అవగాహన కలిపిస్తున్నామని సూచించారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ముగ్గురిపై పీడీ యాక్ట్ కేసులు సిద్ధం చేసినట్లు చెప్పారు.

నిషేధించిన కలుపు మందుల ప్యాకెట్లు సీజ్



ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పురుగు ముందుల దుకాణాలు, తయారీ కేంద్రాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంపాలెంలోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో తనిఖీలు చేయగా, గడువు ముగిసిన, నిషేధించిన వంద గ్రాముల చొప్పున 55 ప్యాకెట్ల అమ్మోనియం సాల్ట్ ఆఫ్ గ్లైఫోసేట్ 71శాతం ఎస్‌జీ గుర్తించారు. నాయుడుపేట శ్రీనివాస సీడ్స్ నుంచి గుంటూరులోని శబరి క్రాప్ కేర్ సైన్స్ ప్రై లిమిటెడ్‌కు సరఫరా చేసినట్లు నిర్ధారించారు. ఈనెల 4న సరఫరా అయినట్లు తనిఖీల్లో గుర్తించారు. సుమారు రూ.11 వేలు ఖరీదు చేసే 55 ప్యాకెట్ల కలుపు మందులను సీజ్ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు, గుంటూరు పట్టణ పురుగు మందుల ఇన్‌స్పెక్టర్ ఆర్.సుజాత పాల్గొన్నారు.

నిరుపేద వైద్య ఖర్చులకు రూ.10 వేలు సాయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉల్లంగుంట శ్రీనివాసరావుకు అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెన్స్ ఇంగ్లిష మీడియం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ చెరుకుపల్లికి చెందిన మెగాస్టార్ చిరంజీవి అభిమాని శ్రీనివాసరావు, అనారోగ్యానికి గురైన ఆయన తల్లి వైద్య ఖర్చుల కోసం తమను సంప్రదించడంతో మానవతా దృక్పథంతో సాయాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేకల సాయి శ్రీకర్, లక్ష్మీ భారతి, శ్రీదేవి, హెచ్ఎం మీనాక్షి పాల్గొన్నారు.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

నెహ్రూనగర్: బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్ రూపాయికే అందిస్తున్నట్లు ఆ సంస్థ గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సప్పవరపు శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్ కింద రూపాయికే 30 రోజుల వ్యాలిడీటీతో, అపరిమిత కాలింగ్, రోజుకి 2జీబీ డేటా, రోజుకు వంద మేసేజ్‌లు అందిస్తున్నామన్నారు. ఎంఎన్‌పీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌లోకి వచ్చే వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని చెప్పారు. ఈ ఆఫర్ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్


నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించే కార్యక్రమానికి 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

బాబాయిపై దాడి



లక్ష్మీపురం: చెడు అలవాట్లు మానుకోమని మందలించిన బాబాయిపై కత్రతో దాడి చేసిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు శారదాకాలనీ 7వ లైన్‌కు చెందిన షేక్ సిలార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన సిలార్ సోదరుడి కుమారుడు హుస్సేన్ ఇటీవల చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ విషయం తెలిసిన బాబాయి సిలార్, హుస్సేన్‌ను చెడు అలవాట్లు మానుకోవాలని మందలించాడు. దీంతో హుస్సేన్, బాబాయి సిలార్‌పై కత్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రక్తపు మడుగులో ఉన్న సిలార్‌ను స్థానికుల జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం సిలార్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి



చేబ్రోలు: అతిగా మద్యం సేవించిన స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి చెందిన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఫాసి గ్రామానికి చెందిన మిధున్ మండల్ (30) గత రెండు సంవత్సరాలుగా కేకే స్పింటెక్స్‌లో స్పిన్నింగ్ మిల్లు లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మిధున్ మండల్, అతని భార్య సంధ్యా రాణి మండల్‌తో కలిసి మిల్లులో పనిచేస్తూ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. మిధున్ మండల్ మద్యానికి బానిసవటంతో జీతం వచ్చిన తరువాత ఆహారం తీసుకోకుండా నిరంతరం మద్యం సేవించి మిల్లు ఆవరణలో తిరుగుతూ ప్రదాన గేటు వద్ద పడిపోయాడు. సెక్యూరిటీ గార్డు గుర్తించి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. అతిగా మద్యం తాగటం ఆహారం తీసుకోకపోవటంతో గొంతు ఎండిపోయి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చవితిని ప్రశాంతంగా చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్‌అజీజ్

నగరంపాలెం: వినాయక చవితిని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వర్తించుకోవాలని తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ అన్నారు. ఆదివారం లాలాపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో చవితి పందిళ్లు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పందిళ్లు, మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిరంతరం కమిటీలోని ఒకరూ పహారా ఉండాలన్నారు. విద్యుత్ వాడుకంలోనూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఖరీదైన వస్తువులు, ఇతరత్రా సామగ్రిని పర్యవేక్షించాలని అన్నారు. అదే విధంగా నిమజ్జనం , ఊరేగింపులు ఇతరత్రా వివరాలను విధిగా పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. తద్వారా పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీఐ ఏవీ శివప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి తాగితే కఠిన చర్యలు..

గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ హెచ్చరించారు. గతంలో గంజాయి, డ్రగ్స్ సరఫరా, గంజాయి తాగి పట్టుబడిన వారికి ఆదివారం కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏదైనా ప్రాంతంలో గంజాయి తాగినట్లు కనిపించిన ఉపేక్షించేదిలేదని అన్నారు.

అలరించిన పౌరాణిక నాటికల్లో సన్నివేశాలు



సత్యహరిశ్చంద్రలో అడవి సన్నివేశం

నగరంపాలెం: స్థానిక నల్లచెరువు 15 వీధిలోని షిరిడి సాయిబాబా ఆలయ కళా ప్రాంగణం వేదికపై ఆదివారం సాయంత్రం పౌరాణిక నాటికల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి(విజయవాడ), శ్రీగౌరీ శంకర కళా నాట్యమండలి సాంస్కృతిక సమాజ సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. తొలుత సత్య హరిశ్చంద్ర అడవి సన్నివేశం, శ్రీకృష్ణ తులాభారం నాటకం ప్రదర్శించారు. చక్కటి పద్యాలతో కళాభిమానులను అలరించారు. ప్రముఖ రంగస్థల కళాకారులు ఏపీ ఆదినారాయణరావును వెండి కిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో గౌరీ శంకర కళా నాట్య మండలి వ్యవస్థాపకులు సనిశెట్టి సాంబశివరావు, పౌరాణిక కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు, చెన్నుపాటి కృష్ణారావు, ఆలయ పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి నాగేశ్వరరావు, మిర్చి శ్రీనివాసరావు, కళాకారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన

సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి దండా

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నార్నే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచినప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ఒక్కటి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సంవత్సరం గడిచిందని సుపరిపాలన పేరుతో యాత్రలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు కార్మికులకు ఏం చేశారని ప్రశ్నించారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ క్లెయిమ్ లు పరిష్కరించాలని కోరారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, వలస కార్మికులకు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికుల సమాచారాన్ని లేబర్ డిపార్ట్‌మెంట్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఖాసీం వలి, బాబూరావు, కె.శ్రీనివాసరావు, హుస్సేన్ వలి, నక్కా మస్తాన్, విజయ్ పాల్గొన్నారు.

శ్రేష్ట హాస్పిటల్స్‌లో కంప్లీట్ కరోనరీ స్టెంటింగ్ వర్క్ షాప్



వర్క్‌షాపులో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో శ్రేష్ట హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రపంచ స్థాయి సాంకేతికతను గుంటూరుకు తీసుకువచ్చి, ఎంతో మంది రోగులకు అత్యుత్తమ చికిత్సను అందిస్తోంది కార్డియాలజిస్టులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున, డాక్టర్ కొరప్రాటి హేమ సుందర్ పేర్కొన్నారు. గుంటూరు గుజ్జనగుళ్ల సెంటర్‌లోని హాస్పిటల్స్‌లో కరోనరీ స్టెంటింగ్ వర్క్ షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. గతంలో గుండెజబ్బు రోగులకు హార్ట్‌లో బ్లాక్స్ ఉండే వాళ్లకు స్టెంట్లు, బైపాస్ సర్జరీ చేయలేని వారికి మందులతో సరిపెటేవారు. ఆధునిక టెక్నాలజీతో రోటాబ్లేషన్, ఐవస్ పద్ధతుల ద్వారా హై రిస్క్ రోగులకు విజయవంతంగా చికిత్స అందిస్తున్నట్లు కార్డియాలజిస్ట్ లు వివరించారు. ఇలాంటి టెక్నాలజీ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి మెట్రో నగరాల్లోనే అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం గుంటూరులో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఐదు క్లిష్టమైన కేసులను ఒకేరోజు చికిత్స చేశామని, వారు పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి..!



కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామంలోని కొండవీటి కమిటీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. 1976 నుంచి 1980 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హైస్కూల్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. కొండవీటి కమిటీ పాలకవర్గ కరస్పాండెంట్ గాదె వెంకటసుబ్బారెడ్డి, అధ్యక్షుడు గాదె వెంకటరెడ్డిలు పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గురువులు ఆర్‌వీ సుబ్బారెడ్డి, దుష్యంత్ రెడ్డి, వెంకటరెడ్డి, సాంబశివరావులకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు.